## క్లుప్తంగా

### భక్తిశ్రద్ధలతో గోపూజలు



తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో గోవుకు పూజ చేస్తున్న మహిళ

**అక్కిరెడ్డిపాలెం:** కనుమ పండగను పురస్కరించుకుని మంగళవారం గోపూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. షీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలో గల శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలోని గోశాలలో గోవులకు ప్రత్యేక పూజలు చేశారు. దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో గోవులను ప్రత్యేకంగా అలంకరించి, పూజించారు.

**శ్రీకృష్ణాపురం గోశాలలో..**



గోవులకు మేత తినిపిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి, ట్రస్ట్‌బోర్డు సభ్యులు

**సింహాచలం:** కనుమ పండగ పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలలో మంగళవారం గోపూజలు విశేషంగా జరిగాయి. గోశాలలోని ఆవులకు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి పసుపుకుంకుమలు సమర్పించారు. శ్రీకృష్ణుడి విగ్రహం చెంతన ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు శ్రీకృష్ణాష్టకం పఠించి విశేషంగా హారతులు అందజేశారు. దేవస్థానం అర్చకుడు సంతోష్‌శర్మ, ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

### దయాల్ రెడ్డికి ఘన నివాళి



దయాల్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గురుమూర్తిరెడ్డి

**పెదగంట్యాడ:** వెంకన్నపాలెం తొలి సర్పంచ్‌గా తిప్పల దయాల్‌రెడ్డి అందించిన సేవలు మరువలేమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. దయాల్‌రెడ్డి 18వ వర్ధంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో గంగవరం పోర్టు వంతెన వద్ద మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో దయాల్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, మహ్మద్ ఇమ్రాన్, నాయకులు పాల్గొన్నారు.

### అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు భారీగా అభిమానులు



మాట్లాడుతున్న జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ పూర్ణ

**అగనంపూడి:** విజయవాడలోని స్వరాజ్య మైదానంలో ఈ నెల 19న జరగనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు 79, 85 వార్డుల నుంచి భారీస్థాయిలో దళిత సంఘాలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్తున్నారని ఆ పార్టీ జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ జి.పూర్ణానందశర్మ (పూర్ణ) తెలిపారు. అగనంపూడిలోని పార్టీ కార్యాలయంలో దళిత సంఘాల నేతలతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. అంబేడ్కర్ కాంస్య విగ్రహం, స్మృతి వనం ఏర్పాటులో సీఎం జగన్ కృషి అభినందనీయమన్నారు. సమావేశంలో వార్డు నాయకులు డేవిడ్, పుల్లయ్య, ఆశాలత, చంద్రమౌళి, సాయి, ముమ్మల రవి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పరసల సందడి ప్రారంభం

- మిందిలో కోలాహలంగా కోదండరాముడి పరస
- దానబోయినపాలెంలో ఘనంగా రాముల వారి తీర్థం
- నడుపూరులో వైభవంగా సీతారాముల పరస



మిందిలో పూజలందుకున్న సీతారాములు



సీతారాముల పరసలో జనం సందడి

**గాజువాక:** తెలుగువారి పెద్ద పండగ సంక్రాంతి ముగిసిన నేపథ్యంలో గ్రామీణ ఉత్సవాలైన పరసల సందడి మొదలైంది. గాజువాక నియోజకవర్గంలో గ్రామాల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ఇక్కడ నెల రోజుల పాటు పరసలు కనువిందు చేస్తాయి. ఈ సందర్భంగా ప్రదర్శించే సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకలకు మరింత అందాన్ని తెస్తాయి. గాజువాక, పెదగంట్యాడ మండలాల పరిధిలో విస్తరించిన నియోజకవర్గంలో దాదాపు 45 స్థానిక గ్రామాలున్నాయి. గాజువాకలోని పురాతన గ్రామాలైన జోగవానిపాలెం, అజీమాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాలైన చినగంట్యాడ, చట్టివానిపాలెం, మింది, అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం, తోకాడ, యారాడ, కొత్తదిబ్బపాలెం పూర్తిగా స్థానిక గ్రామాలే. వీటితో పాటు స్టీల్‌ప్లాంట్ పునరావాస కాలనీలు కూడా స్థానిక గ్రామాలే. గతంలో గ్రామాలుగా ఉన్న పెదగంట్యాడ, వడ్లపూడి, అగనంపూడి, దువ్వాడ, గంగవరం, యాతపాలెం గ్రామాలు ప్రస్తుతం పునరావాస కాలనీలుగా అభివృద్ధి చెందాయి. ఈ ఐదు పునరావాస కాలనీల్లోను సుమారు 64 గ్రామాలకు చెందిన నివాసులు స్థానికులే. ఉపాధి నిమిత్తం ఈ ప్రాంతానికి ఎంతమంది వలసలు వచ్చి స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్నప్పటికీ స్థానిక గ్రామాల సంఖ్య ఎక్కువగా ఉండటంతో సంక్రాంతి అనంతరం ఈ గ్రామాల్లో పరసల హడావుడి మొదలవుతుంది.

**సందడే సందడి**

గ్రామాల్లో పరసలు, తిరునాళ్ల పేరుతో ఉత్సవాలను నిర్వహిస్తూ గ్రామీణ సంప్రదాయాలను కొనసాగిస్తారు. పలు ప్రాంతాల్లో ప్రముఖ వ్యక్తుల జ్ఞాపకార్థం కూడా పరసలను నిర్వహిస్తారు. పెదగంట్యాడ మాజీ సర్పంచ్ తిప్పల దయాల్‌రెడ్డి, పాతగాజువాక మాజీ సర్పంచ్ ఉరుకూటి చిట్టినాయుడుతోపాటు పలువురు ఇతర ప్రముఖులకు కూడా పరసలతో నివాళులర్పించడం ఆనవాయితీగా వస్తోంది. సీతారామ ఉమా రామలింగేశ్వరస్వామి తీర్థ మహోత్సవం (గాజువాక పరస)ను ధూమ్‌ధామ్‌గా నిర్వహిస్తారు. ఈ పరసతోనే గాజువాక ప్రాంతంలో పరసల సందడి ముగుస్తుంది.

**కళాకారులకు పండగే**

పరసలు సాగే నెల రోజులపాటు కళాకారులకు మంచి అవకాశాలు లభిస్తాయి. సంప్రదాయ కళలైన భజనలు, సాము గరిడీలు, తోడపెద్దుల ప్రదర్శన, తప్పెటగుళ్లు, కోలాటాలు, చిడతలతో పాటు స్థానికంగా ఉండే కళాకారుల ప్రదర్శనలు ఆద్యంతం ఉత్సాహాన్ని నింపుతాయి. ఇతర ప్రాంతాల నుంచి డ్యాన్స్ బేబీ డ్యాన్స్, సంగీత విభావరి కార్యక్రమాలు, సాంఘిక నాటకాలు, పౌరాణిక డ్రామాలు, కోయ డ్యాన్సులు, డూప్స్ బాబోయ్ డూప్స్, బుర్రకథ తదితర కార్యక్రమాలు కనువిందు చేస్తాయి. భారీ విద్యుత్ అలంకరణలతో ఆయా గ్రామాల్లోని రోడ్లు ధగధగలాడతాయి.

**ఘనంగా రాములోరి తీర్థం**

**అగనంపూడి:** రాములోరి పరసను 85వ వార్డు అగనంపూడి నిర్వాసిత కాలనీ దానబోయిపాలెంలో సోమవారం కనులపండువగా నిర్వహించారు. సీతారాముల ఆలయ ఆవరణలో నిర్వహించిన ఈ తీర్థ మహోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. తీర్థంలో సాముగరిడీలు, కర్రసాములు, కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వైఎస్సార్‌సీపీ జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ జి.పూర్ణానందశర్మ (పూర్ణ) సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

**వేడుకగా కోదండ రాముడి పరస**

**అక్కిరెడ్డిపాలెం:** జీవీఎంసీ 68వ వార్డు మిందిలోని శ్రీ కోదండ రాముల పరస మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మింది గ్రామం విద్యుత్ కాంతులతో మెరిసింది. రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, కుటుంబ సభ్యులు, కార్పొరేటర్ గుడివాడ అనూష , వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్, పార్టీ సీఈసీ సభ్యుడు గుడివాడ అప్పలరామ్మూర్తి, పలువురు గ్రామ నాయకులు సీతారాములను దర్శించుకుని పూజలు చేశారు. పరస మహోత్సవంలో ఏర్పాటు చేసిన రంగుల రాట్నాలు, ఉయ్యాలలు, స్టాళ్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. సాముగరిడీ, దీపాలంకరణతో రాముల వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ కోదండ రామాలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మింది పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



నడుపూరు సీతారాముల పరసలో డ్యాన్స్ షో

**నడుపూరులో ఘనంగా సీతారాముల పరస**

**పెదగంట్యాడ:** జీవీఎంసీ 76వ వార్డు నడుపూరులో సీతారాముల పరసను మంగళవారం ఘనంగా నిర్వహించారు. సీతారాములను ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. ఇందులో భాగంగా సాయంత్రం శ్రీకృష్ణ దేవరాయ యూత్, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన పరసకు భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన డ్యాన్స్ షోలు, కోలాటాలు, సాముగరిడీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



మింది కోదండరాముడి పరసలో కిటకిటలాడుతున్న జనం



దానబోయిపాలెం సీతారాముల ఆలయ ఆవరణలో తీర్థం

## విండ్‌బాల్ క్రికెట్ పోటీల విజేత జేవీపీ స్టార్స్



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

**గాజువాక:** జీవీఎంసీ 67వ వార్డు వైఎస్సార్‌సీపీ యూత్ వింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైఎస్సార్ విండ్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌లో స్థానిక జోగవానిపాలేనికి చెందిన జేవీపీ స్టార్స్ జట్టు విజయం సాధించింది. రెండో స్థానాన్ని వెంకీ వారియర్స్ సొంతం చేసుకుంది. హెచ్‌ఎస్సార్ యూత్‌కు చెందిన క్రీడాకారులు బెస్ట్ బౌలర్, బెస్ట్ బ్యాట్స్‌మన్‌గా నిలిచారు. మొదటి, ద్వితీయ స్థానాలను సాధించిన జట్లకు రూ.12వేలు, రూ.6వేలు, బెస్ట్ బౌలర్, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌కు రూ.2వేల చొప్పున నగదు బహుమతులను, ట్రోఫీలను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన పోటీల నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, స్థానిక నాయకులు పల్లా పెంటారావు, ఎస్‌ఎండీ గౌస్, సూర్యనారాయణ, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా పతంగుల పండగ



గాలిపటాలను ఎగరవేస్తున్న ఉరుకూటి చందు తదితరులు

**పెదగంట్యాడ:** సంక్రాంతి సంబరాల్లో భాగంగా కనుమ పండగను పురస్కరించుకుని యారాడ తీరంలో వైఎస్సార్ సీపీ నాయకులు మంగళవారం పతంగుల పండగ (కైట్ ఫెస్టివల్) నిర్వహించారు. వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు) ముఖ్య అతిథిగా పాల్గొని గాలిపటాలను ఎగరవేశారు. కార్యక్రమంలో 66వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్, నాయకులు గుడివాడ లతీష్, వాసు, పూర్ణానంద శర్మ, బొడ్డ గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

## నాటుకోళ్లకు డిమాండ్

**రికార్డు స్థాయిలో పలికిన ధర**



చికెన్ సెంటర్ వద్ద జనం క్యూ

**గాజువాక:** కనుమ సందర్భంగా గాజువాకలో నాటుకోడికి ఎక్కడలేని గిరాకీ ఏర్పడింది. వాటి కోసం జనం మాంసం దుకాణాలకు ఎగబడ్డారు. దీంతో వాటి ధర అమాంతం పెరిగిపోయింది. కనుమ రోజు నాటుకోడి తినాలన్న ఆనవాయితీలో భాగంగా జనం వాటి కోసం క్యూ కట్టారు. చికెన్ సెంటర్లలో కూడా ఈసారి నాటుకోళ్లను అందుబాటులో ఉంచడంతో ఆయా దుకాణాల వద్ద కూడా రద్దీ పెరిగింది. కోళ్ల లభ్యత తక్కువగా ఉండటంతో నాటుకోడి మాంసం ధరను వ్యాపారులు కిలో రూ.900కు విక్రయించారు. మేక, గొర్రెల మాంసానికి ఈ ధర సమానంగా ఉండటంతో జనం విస్మయానికి గురయ్యారు. నాటుకోళ్లను పెంచుకునేవారు కూడా లైవ్ కోడిని కిలో రూ.850కి విక్రయించారు. లైవ్ కొనుగోలు చేసినవారు వాటిని కోయించుకోవడానికి మరో రూ.150 అదనంగా పెట్టాల్సి వచ్చింది. అయినప్పటికీ నాటుకోళ్లు దొరక్క కొంతమంది మాంసంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

## సామాన్యుల సేవలో మాస్టర్ ఈకే సంస్కృతి సదన్




సావనీర్ ఆవిష్కరిస్తున్న సీహెచ్‌ఎస్ఎన్ రాజు, సత్యదేవ్, బీఆర్‌కే రాజు

**మహారాణిపేట :** సామాన్యులకు తన వంతు సేవలు అందించడమే మాస్టర్ ఈకే సంస్కృతి సదన్ ప్రధాన ఆశయమని ది వరల్డ్ టీచర్ ట్రస్ట్ (జగద్గురుపీఠం) డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ పేర్కొన్నారు. పీఠం ముప్పై సంవత్సరాల నుంచి చేసిన సేవల వివరాలతో కూడిన సావనీర్ (ప్రత్యేక సంచిక)ను అంకోసా ఫంక్షన్ హాల్లో ఆవిష్కరించారు. అనేక ఆధ్యాత్మిక, సేవా సంస్థలకు మార్గదర్శకత్వం వహించిన మాస్టర్ ఈకే, పార్వతీకుమార్ సత్సంకల్పానికి ప్రతిరూపమే మాస్టర్ ఈకే సంస్కృతి సదన్ అని ఆయన అన్నారు.

**1994లో శ్రీకారం**

1994లో స్వర్గీయ డాక్టర్ టి.వి.వి.ఎస్.రావు నేతృత్వంలో ఇక్కడ మాస్టర్ హోమియో వైద్యాలయం ఏర్పాటు చేసి వేలాది మందికి ఉచితంగా వైద్యం అందిస్తున్నామన్నారు. 1 నుంచి 10వ తరగతి వరకు 444 మందికి ఉచిత విద్యనందించినట్లు తెలిపారు. జగద్గురుపీఠం సలహామండలి సభ్యుడు సి.హెచ్.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ నిస్వార్థ సేవ, ఆధ్యాత్మిక సాధన, త్యాగనిరతి అనేవి తరించడానికి దోహదపడతాయన్నారు. బాలవికాస కేంద్రంలో 324 మంది చిన్నారులకు ప్రవేశం కల్పించామన్నారు. సంగీత జనకులం ద్వారా కూడా సేవలందిస్తున్నామని ఆయన చెప్పారు. ట్రస్ట్ జాతీయ ఉపాధ్యక్షులు ఎస్.వి.ఎస్.మూర్తి, నిర్వాహక సభ్యులు అజ్జరపు శ్రీనివాస్, యు.సి.హెచ్.బి. వర్మ, సర్కిల్ ఆఫ్ గుడ్ విల్ కార్యనిర్వాహక సభ్యులు జి.వి.ఎస్. హరి పాల్గొన్నారు.

## కార్మిక సమస్యలు పట్టని కేంద్ర ప్రభుత్వం



దీక్షలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

**కూర్మన్నపాలెం:** కార్మికుల సమస్యలను కేంద్రప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ పేరుతో కార్పొరేట్ కంపెనీలకు అమ్మేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్తారన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1069వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో ప్లాంట్‌లోని పలు విభాగాలకు చెందిన కార్మికులు కూర్చుని, కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చే శారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దేశ ప్రజలు తిరగబడే రోజు వస్తుందన్నారు. కార్మికులను పట్టించుకోని ప్రభుత్వాల పరిస్థితి నేటికీ దీనంగా ఉన్నాయన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిచి ప్రభుత్వరంగ సంస్థల జోలికి రాకుండా ఉంటేనే మంచిదని హితవు పలికారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

## సింహగిరిపై ముగిసిన ధారోత్సవాలు

**సింహాచలం:** సింహగిరిపై ధారోత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిని,గోదాదేవి ఒక పల్లకీలో, మదన గోపాలస్వామిని వేరొక పల్లకీలో అధిష్ఠింపజేశారు. సువర్ణ అమ్మవారిని, చతుర్భుజ తాయారు అమ్మ వారిని, ఆళ్వారులను మరో పల్లకీలో ఉంచి, మేళతాళాల మధ్య ఆలయం నుంచి తిరువీధిగా గంగధార వద్దకు తీసుకెళ్లారు. అక్కడ స్నపనం నిర్వహించారు. అనంతరం గంగధార వద్ద ఉన్న ప్రాచీన మండపంలో స్వామిని, అమ్మవార్లకు విశేష అలంకరణ చేసి, పాశుర విన్నప పఠనం చేశారు. ఆలయ స్థానాచార్యులు టి.పి. రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు,అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.



## నేత్రపర్వం.. మకర జ్యోతి దర్శనం



విశేష అలంకరణలో అయ్యప్పస్వామి



ధ్వజస్తంభంపై కర్పూర జ్యోతి

**ఉక్కునగరం:** ఉక్కునగరంలోని అయ్యప్పస్వామి ఆలయంలో మకర జ్యోతి దర్శనం భక్తులను పరవశులను చేసింది. సంక్రాంతి సందర్భంగా లభించే ఈ దివ్యజ్యోతి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా ఉక్కునగరం అయ్యప్ప ఆలయంలో సోమవారం వేకువ జామున గణపతి హోమం నిర్వహించారు. అయ్యప్పస్వామిని ప్రత్యేకంగా పుష్పాలతో అలంకరించారు.

స్వామికి అష్టాభిషేకాలు, అర్చనలు చేశారు. ఆలయంలో స్వాములు ప్రవేశించే 18 మెట్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం కార్యక్రమంలో భాగంగా అయ్యప్ప స్వామికి సంధ్యా హారతి ఇచ్చారు. ఆలయం ధ్వజస్తంభంపై కర్పూర జ్యోతి దర్శనం కల్పించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

# బోసిపోయిన గాజువాక



జనసంచారం లేని పాతగాజువాక జంక్షన్

**నిర్మానుష్యంగా రహదారులు**



ఖాళీగా దర్శనమిస్తున్న గాజువాక మెయిన్ రోడ్



ప్రయాణికులు లేని పాతగాజువాక బస్ స్టాప్

**గాజువాక:** జనంతో నిత్యం కిక్కిరిసి కనిపించే గాజువాక పండగ వేళ బోసిపోయింది. ఇసుకేస్తే రాలనంతగా వాహనాలు, జనాలతో రద్దీగా కనిపించే రోడ్లన్నీ నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. తెలుగువారు ప్రతిష్టాత్మకంగా జరుపుకొనే సంక్రాంతికి వలసల కేంద్రంగా ఉన్న గాజువాక ఖాళీ అయిపోవడంతో మంగళవారం చోటుచేసుకున్న దృశ్యమిది.

**కాలనీలన్నీ ఖాళీ..**

పొగగొట్టాల భగభగలు, యంత్రభూతాలతో నిండిన ఫ్యాక్టరీల సైరన్ కూతల వాతావరణానికి పట్టణవాసులు సెలవు ప్రకటించి పండక్కి తమ ఊళ్లకు వెళ్లిపోవడంతో కాలనీలకు కాలనీలే ఖాళీ అయిపోయాయి. గాజువాక ప్రాంతంలోని వివిధ కాలనీల్లో నివాసముంటున్న లక్షలమంది కార్మికులు, కార్మిక కుటుంబాలు పెద్ద సంఖ్యలో పండక్కి వెళ్లిపోయారు. గాజువాకలోని భానోజీతోట, పాత గాజువాక ప్రాంతంలోని ఎల్‌బీఎస్‌నగర్, దశమికొండ, శ్రీనగర్, సుందరయ్యకాలనీ, సింహగిరి కాలనీ, పైడిమాంబ కాలనీ, పెంటయ్యనగర్, కృష్ణానగర్, గణేష్‌నగర్, బొజ్జన్నకొండ, అప్పన్న కాలనీ, మరో ఎనిమిది కొండకాలనీల్లో వలస కుటుంబాలు ఉంటున్నాయి. కూర్మన్నపాలెం ప్రాంతంలోని రాజీవ్‌నగర్, వుడా కాలనీలు, ఉప్పర కాలనీ, రాసాలమ్మ కాలనీ, సిద్ధార్థనగర్, పెదగంట్యాడలోని పలు కాలనీల్లో వలస కుటుంబాలు నివాసముంటున్నాయి. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలతో పాటు విశాఖ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలు, ఇతర జిల్లాల నుంచి కూడా ఇక్కడికి వలస వచ్చి నివాసముంటున్న విషయం తెలిసిందే. పండగకు ఆ కుటుంబాలు తమ సొంత ఊళ్లకు చేరుకోవడంతో ఇక్కడి కాలనీలన్నీ ఉస్సూరమంటూ కనిపించాయి. మరోపక్క ప్రభుత్వం అధికారంగా సెలవు ప్రకటించడంతో ప్రభుత్వ కార్యాలయాలు కూడా తెరుచుకోలేదు. దీంతో గాజువాక మొత్తం బోసిపోయింది. రోడ్లన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. పండగపూట రోడ్లన్నీ ప్రశాంతంగా కనిపించడం పలువురు వాహనచోదకులకు మాత్రం ఆనందాన్ని నింపింది.

## పేద మహిళలకు చీరల పంపిణీ



మహిళకు చీర అందజేస్తున్న ఉరుకూటి చందు

**పెదగంట్యాడ:** అభిమాన నాయకుల జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు) అన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న గీత సహకులాల యువజనం సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఏకుల వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ పుట్టినరోజు వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏకుల వెంకటేష్ గౌడ్ ఇంటి వద్ద నిర్వహించిన ఈ వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేశారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏకుల సూర్యప్రకాష్, గెద్దాడ రమేష్, కడవల నాయుడు, దాసరి గోవిందరాజు, లక్ష్మి, శాంతిరెడ్డి, రిబాకమ్మ, మణి తదితరులు పాల్గొన్నారు.

## అక్కిరెడ్డిపాలెంలో ‘ఉక్కు సత్యాగ్రహం’ హీరో



గొంతిన వెంకటలక్ష్మికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఉక్కు సత్యాగ్రహం హీరో సత్యారెడ్డి

**అక్కిరెడ్డిపాలెం:** త్వరలో విడుదల కానున్న ఉక్కు సత్యాగ్రహం సినిమా డైరెక్టర్, ప్రొడ్యూసర్, హీరో పి.సత్యారెడ్డి 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం విచ్చేశారు. ఉక్కు సత్యాగ్రహం చిత్రంలో నటించిన వైఎస్సార్ సీపీ వార్డు మహిళా అధ్యక్షురాలు గొంతిన వెంకటలక్ష్మి నివాసానికి వెళ్లి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ, స్టీల్‌ప్లాంట్ కోసం భూములు, ఇళ్లు త్యాగం చేసిన నిర్వాసితుల కష్టాలపై ఉక్కు సత్యాగ్రహం పేరుతో సినిమాను రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి అప్పారావు, నర్సింగరావు, ధనలక్ష్మి, అవతారం, దేముళ్లు పాల్గొన్నారు.

## కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



స్వర్ణ పుష్పార్చన అనంతరం అమ్మవారికి హారతి

**డాబాగార్డెన్స్ :** బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8గంటల వరకు నిర్వహించిన ఈ పూజ లో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శిరీష, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

**18న సహస్ర తులసిపూజ**

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 18న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో కె. శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనాలనుకుంటే పూజా రుసుం రూ. 1500 చెల్లించి దంపతులు పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.